క్లుప్తంగా

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు, కానుకలు చెల్లించుకున్నారు. ఆలయంలో సామూహిక సత్యానారాయణ వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల నిరసన



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వీఓఏలు

కందుకూరు: సమస్యలు పరిష్కారం కోసం వీఓఏలు సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో చేపట్టిన సమ్మె మంగళవారం నాటికి 30వ రోజుకు చేరింది. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని విరమించేదిలేదని వీఓఏలు తెలిపారు. వీఓఏ నాయకులు డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో వీఓఏలు సరస్వతి, గీత, శారద, పద్మ, రజని, రాంచంద్రారెడ్డి, పర్వతాలు పాల్గొన్నారు.

డెంగీ నిర్మూలనకు సహకరించాలి

డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ధరణికుమార్

మంచాల: డెంగీ నిర్మూలనకు ప్రజలంతా సహకరించాలని డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ధరణికుమార్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ డెంగీ డే సందర్భంగా మండల కేంద్రంలో ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ధరణి కుమార్ మాట్లాడుతూ.. 2030 వరకు డెంగీ నిర్మూలనే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఇందులో ప్రజా భాగస్వామ్యమే ప్రధానమన్నారు. దోమల నివారణకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీటితో తోక పురుగులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతీ ఫ్రైడే ను డ్రైడేగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, కిరణ్ ప్రసాద్, డివిజన్ ఉప మలేరియా అధికారి ఎం.హేమ్‌లాల్, హెల్త్ ఎడ్యుకేటర్ పి.శ్రీనివాస్, సూపర్‌వైజర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సాయినగర్ కాలనీలో వసతులు కల్పించండి

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడ 8వ వార్డు శ్రీ సాయినగర్ కాలనీలో మౌలిక వసతులను కల్పించాలని కోరుతూ కాలనీ వాసులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. మన్నెగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 18, 19లోని మా కాలనీలో కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దశల వారీగా తాగు నీటి సరఫరా, సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీ, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కస్తూరి రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి బొమ్మిడి శ్రీను, కార్యవర్గ సభ్యులు లింగస్వామి, చందునాయక్, అఖిల్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

అలంకార ప్రాయం.. సెంట్రల్ లైటింగ్

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ నుంచి ఎర్రకుంట వరకు రూ. 60లక్షల వ్యయంతో నిర్మించిన సెంట్రల్ లైటింగ్ వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి పూట అంధకారం నెలకొంటోంది. పహాడీషరీఫ్ నుంచి క్యూబా కాలనీ చౌరస్తా వరకు మాత్రమే వెలుగుతుండగా.. అక్కడి నుంచి ఎర్రకుంట వరకు మాత్రం ఒక్క లైట్ కూడా వెలగడం లేదు. రాత్రి పూట అంధకారం కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతేడాదే ఈ రోడ్డులో ఈ సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. కానీ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఇలా వీధి దీపాలు అలంకార ప్రాయంగా మారడం పట్ల స్థానికులు మండి పడుతున్నారు. ఏ పట్టణంలోనైనా విద్యుద్దీపాల వెలుగులు జిగేలుమంటుండగా.. జల్‌పల్లి పట్టణంలో మాత్రం ఇలా అంధకారం నెలకొని ఉండడమేంటని ప్రశ్నిస్తున్నారు. వెంటనే వీధిదీపాలు వెలిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



ఎర్రకుంట రోడ్డులో వెలగని వీధి దీపాలు

వేసవి శిబిరం.. భవిష్యత్తు పదిలం

- సెలవుల నేపథ్యంలో క్రీడలపై దృష్టి
- సమ్మర్ క్యాంపులకు పోటెత్తుతున్న చిన్నారులు
- ఉదయం, సాయంత్రం వేళల్లో పలు అంశాల్లో శిక్షణ
- క్రీడాకారులతో కళకళలాడుతున్న సరూర్‌నగర్ స్టేడియం

హుడాకాంప్లెక్స్: జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులు సత్ఫలితాలు ఇస్తున్నాయి. చదువు పేరుతో పది నెలలుగా నాలుగు గోడల మధ్య నలిగిపోయిన పిల్లలు.. వేసవి సెలవుల్లో పలు క్రీడాంశాల్లో శిక్షణ పొందుతూ ఎంజాయ్ చేస్తున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు ప్రత్యామ్నాయంగా ఆటపాటల్లో శిక్షణ ఇప్పించాలని భావించి ఆ మేరకు వారికి నచ్చిన అంశాల్లో చేర్పిస్తున్నారు. ఆయా అంశాల్లో పిల్లలు కనపరుస్తున్న ప్రతిభను చూసి తల్లిదండ్రులతో పాటు కుటుంబసభ్యులు మురిసిపోతున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన పిల్లలు ఆ తర్వాత మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణిస్తున్నారు.

కళకళలాడుతున్న స్టేడియం

వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లల కోసం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం అధికారులు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశారు. ఉదయం 5నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4నుంచి రాత్రి 7గంటల వరకు ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, ఆర్చరీ, క్రికెట్, రన్నింగ్, స్కేటింగ్, జిమ్నాస్టిక్, కరాటే, కబడ్డీ, ఖోఖో, స్విమ్మింగ్ వంటి క్రీడాంశాల్లో నామమాత్రపు ఫీజుతో శిక్షణ ఇస్తున్నారు. స్విమ్మింగ్ సహా పలు క్రీడాంశాల్లో సామర్థ్యానికి మించి విద్యార్థులు వస్తుండడంతో కోచ్‌లు కూడా ఏమీ చేయలేక చేతులెత్తేయాల్సి వస్తోంది. టెన్నిస్, కబడ్డీ, క్రికెట్ వంటి అంశాల్లో అడ్మిషన్ దొరకని పరిస్థితి నెలకొంది. ఆశించిన దానికంటే అధిక సంఖ్యలో పిల్లలు వస్తుండడం, గ్రౌండ్‌లో అంతా కలిసి ఆడుతుండటంతో స్టేడియానికి కొత్త కళను సంతరించుకుంది.

శిక్షణ ఇస్తూ.. ఉపాధి పొందుతూ..

సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో పదిమంది వరకు రెగ్యులర్ కోచ్‌లు ఉన్నారు. విశాలమైన క్రీడా మైదానంతో పాటు అనుభవం ఉన్న కోచ్‌లు ఇక్కడ ఉండడంతో మెజార్టీ తల్లిదండ్రులు తమ పిల్లలను ఇక్కడికే పంపుతున్నారు. అయితే విద్యార్థుల నిష్పత్తి మేరకు కోచ్‌లు లేకపోవడంతో అధికారులు జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను కోచ్‌లుగా ఎంపిక చేసి, వారికి ఉపాధి కల్పిస్తున్నారు. ఈ సమ్మర్ క్యాంపులు కేవలం విద్యార్థులకే కాదు ప్రైవేటు కోచ్‌లకు ఉపాధి అవకాశంగా మారాయి.



స్కేటింగ్ ఆడుతున్న చిన్నారులు



త్రోబాల్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఆరోగ్యం.. ఆనందం

క్రీడలు శారీరక ధృడత్వానికే కాదు మానసికోల్లాసానికి దోహదపడతాయి. విద్యార్థుల మధ్య స్నేహ భావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయి. నాయకత్వ లక్షణాలు అలవడతాయి. ఆటలతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి.

– వెంకటేశ్వర్‌రావు, డీఎస్‌డీఓ, రంగారెడ్డి జిల్లా

ఉపాధి లభించింది



చిన్నప్పుడు సరదాగా నేర్చుకున్న ఆటే ప్రస్తుతం జీవనోపాధిగా మారింది. ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నారులకు స్కేటింగ్‌లో శిక్షణ ఇస్తున్నా. రోజుకు 200 మంది వరకు వస్తున్నారు. విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న నామమాత్రపు ఫీజు నుంచే మాకు వేతనాలు చెల్లిస్తున్నారు. ఖాళీగా ఉన్న కోచ్ పోస్టులను భర్తీ చేసి, స్పోర్ట్స్‌కు ప్రాధాన్యత కల్పించాలి.

– సైదులు, స్కేటింగ్ కోచ్

ఈత నేర్చుకుంటున్నా



ఏటా వేసవి సెలవుల్లో నానమ్మ వాళ్ల ఇంటికి వెళ్లేదాన్ని. ఈ సారి ఊరెళ్లలేదు. సమ్మర్ క్యాంపులో భాగంగా స్విమ్మింగ్ నేర్చుకుంటున్నా. ప్రతి రోజూ ఉదయం గంట పాటు స్విమ్మింగ్ చేస్తున్నా. స్విమ్ చేస్తున్నప్పుడు సరదాగా ఉంటుంది.

– సహస్ర, కర్మన్‌ఘట్

స్కేటింగ్ నేర్చుకుంటున్నా



గత ఏడాది నుంచి స్కేటింగ్ నేర్చుకుంటున్నా. స్కూళు వేళల్లో ప్రాక్టీస్ చేయడం సాధ్యమయ్యేది కాదు. ప్రస్తుతం పాఠశాలకు సెలవులు ఇవ్వడంతో రోజు ఇక్కడికి వచ్చి గంటకుపైగా ప్రాక్టీస్ చేస్తున్నా. కోచ్‌లు బాగా నేర్పిస్తున్నారు.

– సోహన్, కొత్తపేట

పాత పనులకు ప్రారంభోత్సవాలా?

బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్‌లో రెండేళ్ల క్రితం పూర్తయిన సీసీ రోడ్డు పనులను ఇప్పుడు ప్రారంభించడమేమిటని బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం కాలనీవాసులతో కలిసి ఆయన మాట్లాడారు. 31వ డివిజన్‌లో గత శనివారం మంత్రి సబితారెడ్డి, మేయర్ పారిజాత, కార్పొరేటర్లు రెండేళ్ల క్రితం పూర్తయిన సీసీ రోడ్లను ప్రారంభించారని, దీన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. శిలాఫలకాలు వేసి ఏళ్లు కావస్తున్నా పనులు ప్రారంభించలేదని, దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని, అవేమీ మంత్రికి పట్టడం లేదని ఆయన ఆరోపించారు. శిలాఫలకాల మంత్రి అని మరోమారు సబితారెడ్డి రుజువుచేసుకున్నారని ఎద్దేవా చేశారు. వాస్తవాలను నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు సిద్ధమా అని ఆయన సవాల్ విసిరారు.

క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ లోగో ఆవిష్కరణ

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ నూతనంగా ఏర్పాటు చేసిన లోగోను ఆర్‌కేపురం పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. ఎన్టీఆర్‌నగర్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, సభ్యులు రమేష్ కుమార్, వినోద్, దీలిప్, రాంసన్, వివిధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



ఆడబిడ్డలకు మేనమామ కేసీఆర్



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

- మంత్రి సబితారెడ్డి
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేత

హుడాకాంప్లెక్స్: ఆడబిడ్డలకు మేనమామలా ఆదుకుంటున్న సీఎం కేసీఆర్ తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా మిగిలిపోతారని మంత్రి సబితారెడ్డి అన్నారు. మంగళవారం సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో 56 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా సబిత మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఈ నియోజకవర్గంలో దాదాపు 1,145 మంది లబ్ధిదారులకు రూ. 11 కోట్ల 52 లక్షలు అందజేశామన్నారు. ముఖ్యమంత్రి అందిస్తున్న ఈ పెళ్లి కానుకను పేదింటి ఆడపడుచులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ నివాసాలను క్రమబద్ధీకరించుకోవడానికి జీవో నెం-58, 59ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ నెలాఖరు వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్సీలు మల్లేశం, దయానంద్ గుప్తా, తహసీల్దార్ జయశ్రీ, బీఆర్‌ఎస్ నాయకులు బాలకిషన్, అరవింద్ శర్మ, మాజీ కార్పొరేటర్ అనిత, నాయకులు మహేందర్ యాదవ్, రాంనర్సింహాగౌడ్, కొండల్‌రెడ్డి, అంకిరెడ్డి, సలీం పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించండి

కందుకూరు: వీఆర్‌ఏల సమస్యలు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆ జేఏసీ జిల్లా కన్వీనర్ వెంకటేష్ ముదిరాజ్ మంగళవారం మంత్రి సబితారెడ్డిని కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, పదోన్నతులు కల్పించాలని, 55 సంవత్సరాలు నిండిన వారి వారసులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కందుకూరు, మహేశ్వరం, బాలాపూర్ మండలాల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్ వినాయక హిల్స్ ఫేస్ -2లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మంగళవారం మంత్రి సబితారెడ్డిని కోరారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రిని కలసి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సాధ్యమైనంత తొందరలో సమస్యలను పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు.

సోనీ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి

బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్

బడంగ్‌పేట్: పంచాయతీ సెక్రటరీ సోని మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించి, బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోనీ మృతికి సంతాపంగా మంగళవారం బీఎస్పీ ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తాలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. పంచాయతీ సెక్రటరీలతో గొడ్డు చాకిరీ చేయించుకున్న ప్రభుత్వం వారి పట్ల ఇంత కర్కశంగా వ్యవహరించడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల హక్కులను కాలరాస్తోందని ధ్వజమెత్తారు. పంచాయతీ జూనియర్ సెక్రటరీలను పర్మినెంట్ చేయాలని ధర్నా చేస్తుంటే డ్యూటీకి రాకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తామని ప్రభుత్వం బెదిరింపులకు దిగడంతో ఆందోళన చెంది ఆత్మహత్య చేసుకుందన్నారు. నిజానికి సోనిది ప్రభుత్వ హత్యే అని ఆరోపించారు. సోని కుటుంబానికి ప్రభుత్వం రూ. 50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబానికి బీఎస్పీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ మహేష్‌చారి, నియోజకవర్గం మహిళా కన్వీనర్ ఇందుమతి, నరసింహ, భాగ్యరాజ్, లక్ష్మీదాస్, రాజశేఖర్, పవన్, జ్ఞానేశ్వర్, అనిత, లలిత, సబిత, యాదయ్య, మధుకర్, మహేష్, శివ, సరిత తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్ చౌరస్తాలో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న బీఎస్పీ నాయకులు

అక్రమంగా విదేశీ మద్యం సరఫరా

- ఐదుగురి అరెస్టు
- 159 బాటిళ్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

దిల్‌సుఖ్‌నగర్: అనుమతులు లేకుండా అక్రమంగా విదేశీ మద్యం సరఫరా చేస్తున్న ఐదుగురిని రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సరూర్‌నగర్ ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. వివిధ బ్రాండ్లకు చెందిన 159 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు. మంగళవారం ఆర్‌కేపురంలోని సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. అల్మాస్‌గూడ నివాసి సంరెడ్డి రవికాంత్‌రెడ్డి అనుమతి లేకుండా విదేశీ మద్యంను సరఫరా చేస్తున్నట్టు సమాచారం అందడంతో ఎక్సైజ్ పోలీసులు అతడి ఇంటిపై దాడి చేసి 9 విదేశీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. రవికాంత్ రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించగా, తాను ఆదిభట్లకు చెందిన శ్రీవీర్‌గౌడ్ వద్ద నుంచి కొనుగోలు చేశానని చెప్పారు. పోలీసులు శ్రీవీర్‌గౌడ్ అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 12 విదేశీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసు విచారణలో అతడు అల్మాగూడకు చెందిన వెంకన్న దగ్గర కొనుగోలు చేశానని చెప్పడంతో పోలీసులు వెంకన్న నివాసంపై దాడి చేయగా 54 విదేశీ మద్యం సీసాలు దొరికాయి. విచారణలో అతడు తాను కాప్రాకు చెందిన సాయికిరణ్‌కుమార్, నాగరాజుల దగ్గర మద్యం సీసాలు కొనుగోలు చేశానని చెప్పాడు. దీంతో పోలీసులు సాయికిరణ్‌కుమార్‌ను అరెస్టు చేసి అతడి వద్ద 84 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అతడిని విచారించగా, తిరుమలగిరికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేశానని చెప్పాడు. అతను సీఎస్‌డీ క్యాంటీన్ నుంచి తెచ్చి ఇతరులకు సరఫరా చేస్తున్నానని తెలిపారు. అధికారు ఐదుగురినీ అరెస్టు చేసి వారి వద్ద నుంచి మొత్తం 159 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ దందాతో సంబంధం ఉన్న మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు.

చిప్పలపల్లిలో కంటి వెలుగు శిబిరం

కందుకూరు: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ బీ జంగారెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని చిప్పలపల్లిలో ఇన్‌చార్జి సర్పంచ్ బాలకృష్ణ, ఎంపీటీసీ లలితాకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ ప్రభుత్వమే కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్ రాజశేఖర్‌రెడ్డి, సీహెచ్‌ఓ రవీందర్, అగర్‌మియాగూడ సర్పంచ్ భూపాల్‌రెడ్డి, నాయకులు కుమార్, కార్తీక్, దీక్షిత్‌రెడ్డి, వెంకటేష్, ప్రశాంత్‌చారి, రామకృష్ణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ జంగారెడ్డి

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

కందుకూరు: మండలంలోని నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాల 1997–98 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా పాతశాలకు చేరుకుని అలనాటి జ్ఞాపకాలను, మధుర స్మృతులను నెమరేసుకున్నారు. మంత్రి సబితారెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి, సర్పంచ్ రామకృష్ణారెడ్డితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం కందుకూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశమై ఎవరెవరు ఏఏ రంగాల్లో స్థిరపడ్డారో అడిగి తెలుసుకున్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు సుందరవరదాచార్యులు, ఉపాధ్యాయులు అంజిరెడ్డి, జగన్నాథాచారి, సాయిబాబా, సరోజనీదేవి, కమలాదేవి, నర్సమ్మ, ప్రభావతి, కల్యాణ్‌రామ్‌శర్మ, గోవింద్‌చిలాల్‌ను ఘనంగా సన్మానించి ఆశీస్సులు తీసుకున్నారు.

విభేదాలతో ఆగిన అభివృద్ధి

- ఏడాదిన్నర క్రితం భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి నిధులు
- అప్పట్లో శంకుస్థాపన చేసిన మంత్రి సబిత
- బీఆర్‌ఎస్, బీజేపీ నేతల వివాదంతో ఆగిన పనులు
- సమీపిస్తున్న వర్షాకాలం
- మళ్లీ ముంపు తప్పదంటున్న స్థానికులు



శిలాఫలకాన్ని పాలతో శుద్ధి చేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు

హుడాకాంప్లెక్స్: అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష బీజేపీల మధ్య నెలకొన్న వివాదం అభివృద్ధి పనులపై ప్రభావం చూపింది. పనులు మంజూరైనా పూర్తి కాకపోవడం.. వర్షాకాలం సమీపిస్తుండడం.. ఆ కాలనీలను మళ్లీ వరదలు ముంచెత్తే ప్రమాదం ఉండటంతో స్థానికుల్లో ఆందోళన మొదలైంది. నిధులు మంజూరు చేసి, సకాలంలో పనులు పూర్తి చేయకపోవడాన్ని స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఏడాదిన్నర క్రితం శంకుస్థాపన

సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని డాక్టర్స్ కాలనీ, ఉర్దూ మీడియం స్కూల్, ఈటెన్ టెంపుల్, హుడా కాలనీ, వెంకటేశ్వర కాలనీ, నర్సింహపురి కాలనీ, వికాస్ నగర్, భగత్‌సింగ్ నగర్, శ్రీనివాస కాలనీ, క్రాంతి నగర్, సరూర్‌నగర్ తదితర ప్రాంతాల్లో మురుగు నీటి పైపులైన్ పునరుద్ధరణ పనులకు జీహెచ్‌ఎంసీ ఏడాదిన్నర క్రితం రూ. 84 లక్షల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు తయారు చేసింది. ఈ పనులకు 2021 డిసెంబర్ 13న స్థానిక కార్పొరేటర్ ఏ శ్రీవాణితో కలిసి మంత్రి సబితారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సమయంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య వివాదం తలెత్తింది. దీంతో ఆయా పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

సమీపిస్తున్న వర్షాకాలం

ఏటా వర్షాకాలంలో ఆయా కాలనీలను వరద ముంచెత్తుతుంది. స్థానికుల నుంచి జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. అయినా ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదు. జూన్ నుంచి మళ్లీ వర్షాకాలం ప్రారంభం కాబోతోంది. ఆయా ప్రాంతాలను మళ్లీ మురుగునీరు ముంచెత్తనుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. శిలాఫలకం వేసి ఏడాదిన్నర దాటినా ఇప్పటికీ పనులు పూర్తి చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు? ఏ వార్తను వినాల్సి వస్తుందోనని భయం భయంతో గడుపుతున్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

శిలాఫలకానికి పాలతో శుద్ధి

సరూర్‌నగర్ డివిజన్‌లో ముంపు ప్రాంతాలను గుర్తించి, వాటి విముక్తికి జీహెచ్‌ఎంసీ నుంచి రూ. 84లక్షలు మంజూరు చేయించా. మంత్రి సబిత అట్టహాసంగా పనులకు శంకుస్థాపన చేసింది. ఏడాదిన్నర పూర్తవుతోంది.. కానీ ఇప్పటికీ పనులు పూర్తి కాలేదు. మంత్రి కేటీఆర్, సబితకు అనేక మార్లు ఫిర్యాదు చేశా. కానీ వారి నుంచి స్పందన లేదు. దీంతో శిలాఫలకానికి పాలతో శుద్ధి చేస్తున్నా. ఇప్పటికైనా మంత్రి సబిత పెద్ద మనస్సు చేసుకుని పనులు పూర్తి చేయించాలి.

హెడ్‌సెట్స్ కొనుగోలుకు విరాళం

దిల్‌సుఖ్‌నగర్: సికింద్రాబాద్ ఖానాజిగూడకు చెందిన సత్యనారాయణ ఆర్‌కే పురంలోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థుల కంప్యూటర్ ల్యాబ్‌కు అత్యవసరమైన హెడ్‌సెట్స్ కొనుగోలు కోసం రూ.25 వేలను మంగళవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ. అనాథ విద్యార్థి గృహం రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అనాథ, నిరుపేద విద్యార్థులకు ఆశ్రయంతో పాటు విద్యా సౌకర్యం కల్పించి వారి భవిష్యత్‌కు కృషి చేయడం అభినందనీయమన్నారు. విరాళం ఇచ్చిన సత్యనారాయణకు గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు. సత్యనారాయణ సతీమణి శ్రీమతి సత్యకళ, గృహం విద్యార్థులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న సత్యనారాయణ